క్లుప్తంగా

చురుగ్గా పారిశుధ్య పనులు



జేసీబీతో చెత్త తీస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తను జేసీబీ సహాయంతో కార్పొరేషన్ సిబ్బంది ఆదివారం తొలగించారు. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందులేర్పడుతున్నాయి. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది పనులు చేపట్టారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

విజయనగరం గంటస్తంభం: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక రోటరీ బ్లడ్‌బ్యాంక్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ ఇన్‌స్టిట్యూట్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. యువత రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్.హరీష్ మాట్లాడుతూ.. స్వతంత్ర ఉద్యమ చరిత్రలో నిలిచిపోయిన వీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. అటువంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో రోగులకు అందించేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పార్థు, వాసు, ఆదిత్య మేఘన, వెన్నెల, సాయి రాజశేఖర్, యువకులు పాల్గొన్నారు.

చురుగ్గా పన్ను వసూలు



పన్నులు వసూలు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

విజయనగరం: నగరంలో పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కె.అప్పలరాజు నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది ఆదివారం చేపట్టారు. పెద్ద మొత్తంలో పేరుకుపోయిన ఆస్తి పన్నును వసూలు చేసే నిమిత్తం నగరంలోని పలు దుకాణాల వద్దకు వెళ్లి తక్షణమే పన్ను చెల్లించాలని పట్టుపట్టారు. దీంతో పన్ను బకాయిదారులు కొంతమంది నగదు చెల్లించగా, మరికొంతమంది చెక్కుల రూపంలో బకాయిలను అందజేశారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో పాటు జప్తు వాహనాన్ని కూడా తీసుకుని వెళ్లి ఆయా బకాయిదారులను పన్ను చెల్లించాల్సిందేనని కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో గాని, సచివాలయాల్లో గాని పన్ను చెల్లించవచ్చని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

ఉపాధి కల్పనకు సహకరించాలి

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



హీరో మోటార్‌సైకిల్‌ను కస్టమర్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

పూసపాటిరేగ: యువతకు ఉపాధి కల్పించే విషయంలో కార్పొరేట్ సంస్థలు సహకరించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. హీరో మోటార్ కార్ప్స్, శ్రీలక్ష్మి హీరో షోరూం సంయుక్తంగా కోనాడ జంక్షన్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సర్వీసు కమ్ సేల్స్ మెగా కార్నివాల్ ఆదివారంతో ముగిసింది. ఎమ్మెల్యే మాధవితో పాటు రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మెన్ కర్రోతు బంగార్రాజులు కస్టమర్లకు కొత్త వాహనాలు అందజేశారు. ఈ సందర్భంగార ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా హీరో సంస్థ వాహనాలను రూపొందించడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా బీ–6 వాహనాలు తయారు చేయడం హర్షణీయమన్నారు. ద్విచక్ర వాహనాల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించి యువతకు శిక్షణ ఇవ్వాలని హీరో షోరూం అధినేత కందికుప్ప చినబాబుకు సూచించారు. కార్యక్రమంలో హీరో మోటార్స్ సేల్స్ విభాగం ఏరియా మేనేజర్ మహీంద్రన్, ఎస్‌ఆర్ఐ ఆస్పత్రి అధినేత డాక్టర్ రమేష్, ప్రజాప్రతినిధులు మహంతి చిన్నంనాయుడు, మహంతి శంకరరావు, రౌతు స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో.. స్మార్ట్ గుబులు..!

- శరవేగంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- గతంలో వ్యతిరేకించిన కూటమి నాయకులు
- ముందుగా వ్యాపార, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు
- త్వరలో గృహాలకు అమర్చేందుకు సన్నాహాలు
- ఆందోళనలో వినియోగదారులు
- మీటర్ రీడర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకమే

నెల్లిమర్ల రూరల్: విద్యుత్ రంగంపై గతంలో టీడీపీ, జనసేన నాయకులు ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించారు. అబద్ధాలు వల్లించి ప్రజల ఆలోచన విధానాన్ని మార్చారు. తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయబోమని.. విద్యుత్ బిల్లులు పెంచబోమంటూ ఊరూరా తిరిగి ఊదరగొట్టారు. తీరా అధికారంలో వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు తగ్గించాల్సింది పోయి అమాంతం పెంచేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టబోమని చెప్పి నేడు దర్జాగా ఏర్పాటు చేస్తున్నారు. ఒప్పుకున్న పెళ్లికి వాయించడం తప్పదన్నట్లు... గెలిపించిన పాపానికి స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసుకోవడం తప్పదంటూ వినియోగదారులు మీటర్లను పెట్టుకుంటున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 2,600 స్మార్ట్ మీటర్లను ఇప్పటి వరకు ఏర్పాటు చేశారు. ముందుగా వ్యాపార, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు. తర్వాత గృహ సముదాయాలకు ఏర్పాటు చేస్తామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

పెనుభారం తప్పదా..?

ఇప్పటికే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసుకుంటున్న వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుల్లో గతంలో కంటే భారీగా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియను క్రమేపీ ఇళ్ల సముదాయాలకు కూడా విస్తరిస్తామని అధికారులు సంకేతాలు ఇస్తుండడంతో వినియోగదారుల్లో భయం మొదలైంది. ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే తమపై ఆర్థిక భారం తప్పదంటూ ఆవేదన చెందుతున్నారు. స్మార్ట్ మీటర్లకు ముందుగా రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆ విధానం అందుబాటులోకి రాకపోయినప్పటికీ అన్ని కనెక్షన్లకూ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసిన తర్వాత రీచార్జ్ ప్లాన్ అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ విధానాన్ని పేద ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



గుతివాడలో ఓ దుకాణంలో ఏర్పాట చేసిన స్మార్ట్ మీటర్

శరవేగంగా..

నెల్లిమర్ల నియోజకవరంలోని డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. కమర్షియల్ సర్వీసులు సుమారు 14 వేలు, ప్రభుత్వ కార్యాలయాలు 3,220, గృహ సర్వీసులు 85,985 ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుగా వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు మండలాల్లో ఇప్పటివరకు సుమారు 2,600 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మీటర్ రీడర్ల భవిష్యత్ ఏమిటో..?

స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే తమ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారబోతోందని మీడర్ రీడర్లు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 34 మంది మీటర్ రీడర్లు ఉన్నారు. ఒక్కో మీటర్ రీడర్‌కు సుమారు 3 వేల కనెక్షన్లు అప్పగిస్తుంటారు. రీడింగ్ తీసినందుకు వారికి ఒక్కో మీటర్ వద్ద రూ.3 చొప్పున ఇస్తున్నారు. ఈ ఉద్యోగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి స్మార్ట్ మీటర్ల విధానం గండంగా మారనుంది. తమకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రీడర్లు ఇప్పటికే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు కూడా సమర్పించారు.

నాడు ఎన్నో అబద్ధాలు..



అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఎన్నికల ముందు కూటమి నాయకులు ఎన్నో అబద్ధాలు చెప్పారు. ప్రజలు కూడా స్మార్ట్‌గా వారి అబద్ధాలను నమ్మేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయమని, విద్యుత్ బిల్లులు పెంచమని స్పష్టమైన హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. ఇది ముమ్మాటికీ ప్రజలను నమ్మించి మోసం చేయడమే.. ప్రస్తుతం వస్తున్న బిల్లుల్లో కూడా భారీగా వ్యత్యాసాలు వస్తున్నాయి. ఏవేవో చార్జీలంటూ పెనుభారం మోపుతున్నారు.

–సారిక వైకుంఠం నాయుడు, వైస్ ఎంపీపీ, నెల్లిమర్ల

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దుర్మార్గం



స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడమంటే పేద ప్రజల మెడకు ఉరి తాడు బిగించడమే. గతంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనని ప్రగాల్భాలు పలికిన చంద్రబాబు నేడు ఏ విధంగా వాటి ఏర్పాటుకు అంగీకరించారు. ప్రజల కష్టాన్ని సంపన్న వర్గాలకు దోచిపెట్టేందుకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతాయి. మీటర్ రీడింగ్ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వేలాది మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయి. ఈ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలి.

–కిల్లంపల్లి రామారావు, సీఐటీయూ నేత, నెల్లిమర్ల

ప్రశాంతంగా ఉల్లాస్ పరీక్ష



పూసపాటిరేగ: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా పరీక్ష రాస్తున్న వయోజనులు



పూసపాటిరేగ: కొప్పెర్లలో ఉల్లాస్ పరీక్ష రాస్తున్న వయోజనులు

పూసపాటిరేగ: వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 1808 మంది వయోజనులు పరీక్షకు హాజరైనట్లు ఉల్లాస్ మండల కోఆర్డినేటర్ జి.ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరక్షరాస్యులైన మహిళలకు మూడు నెలలు ప్రత్యేక బోధన చేసిన తర్వాత పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 54 పరీక్ష కేంద్రాలలో 185 మంది వలంటీర్ల పర్యవేక్షణలో 1808 వయోజనులు పరీక్ష రాశారని చెప్పారు. కొప్పెర్ల, పూసపాటిరేగ, పతివాడ గ్రామాలలో ఏరియా కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్ పరీక్షలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎంలు అచ్యుతరావు, అరుణతో పాటు పలువురు వెలుగు వీఓఏ పాల్గొన్నారు.

99 శాతం హాజరు..

డెంకాడ: మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ అసెస్‌మెంట్ పరీక్షకు 99 శాతం మంది వయోజనులు హాజరయ్యారని పరీక్ష మండల పరిశీలకుడు, వెలుగు ఏపీఎం వి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 43 పరీక్ష కేంద్రాలలో 1830 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 1815 మంది వయోజనులు పరీక్ష రాశారు. వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, క్లస్టర్ కో ఆర్డినేటర్లు, పరీక్ష కేంద్రం సిబ్బంది పరీక్షను పర్యవేక్షిస్తున్నారు.

1785 మంది హాజరు..

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ఉల్లాస్ పరీక్ష విజయవంతంగా ముగిసింది. ఈ పరీక్షను మొత్తం 32 కేంద్రాల్లో నిర్వహించగా... 1830 మందికి గాను 1785 మంది పరీక్ష రాశారు. గొర్లిపేట ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఎంపీడీఓ రామకృష్ణరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా అన్ని గ్రామాల్లోనూ ఉల్లాస్ పరీక్ష నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



డెంకాడ: గుణుపూరుపేట పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం శ్రీనివాస్



నెల్లిమర్ల రూరల్: గొర్లిపేటలో ఉల్లాస్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్ కార్యదర్శిగా రవి



కార్యదర్శి రవిని అభినందిస్తున్న అధ్యక్షుడు సర్వేశ్వరరావు, తదితరులు

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్ కార్యదర్శిగా డాక్టర్ మండపాక రవి 14వ సారి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడిగా ధవళ సర్వేశ్వరరావు, గౌరాధ్యక్షుడిగా టి.మహేశ్వరరావు, కోశాధికారిగా సుధాకర్, ఉపాధ్యక్షులుగా భోగరాజు సూర్యలక్ష్మి, డాక్టర్ పద్మప్రియ, దూసి శివరామ్‌శర్మ, సహాయ కార్యదర్శులుగా సుబ్బారావు, డాక్టర్ విజయాదిత్య, మోడెకుర్తి శ్రీనివాసరావు, సభ్యులుగా అనంతరావు, ప్రసాదరావు, వి.కామేశ్వరరావు, కేఎస్ మూర్తి ఎంపికయ్యారు. గౌరవ సలహాదారులుగా డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ ఎ.రాఘవరావు, డాక్టర్ నగేష్, యామిజాల ప్రభు సన్యాసిరావు, పీఆర్‌కే.శాస్త్రి, చాగంటి కొండలరావు ఎన్నికయ్యారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు సంగీతాన్ని మరింత చేరువ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తామని అధ్యక్షుడు సర్వేశ్వరరావు తెలిపారు. ఎంపికైన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

గిట్టుబాటు కాని మొక్కజొన్నసాగు

- రైతులకు దక్కని మద్దతు ధర
- ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,225
- పెరిగిన పెట్టుబడుల దృష్ట్యా రూ.3 వేలకు పెంచాలని కోరుతున్న రైతులు
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్



శ్రీరంగరాజపురంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట



శ్రీరంగరాజపురం గ్రామంలో మొక్కజొన్న కండెలను వలుస్తున్న మహిళలు

గజపతినగరం: ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు విలవిలలాడుతున్నారు.శ్రమ,పెట్టుబడికి తగిన ఫలితం దక్కకపో తుండడంతో రబీ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రైతుల శ్రమను పక్కనపెట్టి.. దుక్కులు నుంచి విత్తనం నాటి పంటకోతకు వచ్చే వరకు అయ్యే సస్యరక్షణ ఖర్చులను లెక్కగడితే మిగిలేది ఏమీ ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,225 మద్ద తు ధర ప్రకటించింది. ప్రభుత్వం మద్దతు ధర అయితే ప్రకటించింది కానీ ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇదే అవకాశంగా భావించిన దళారులు తమకు నచ్చిన ధరకు పంటను కొనుగోలు చేస్తూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. గత్యంతరం లేక ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకే రైతులు పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఈ ఏడాది దిగుబడులు కూడా ఆశా జనకంగా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోఎకరానికి 35 నుంచి సుమారు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్లు దాటేలా లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,225 సరిపోదని, రూ.3 వేల నుంచి రూ.3,300కు పెంచితే తప్ప మొక్కజొన్న సాగు గిట్టుబాటుకాదని అన్నదాతలు అంటున్నారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గజపతినగరం వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో రబీ మొక్కజొన్న సాగు వివరాలు

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
గజపతినగరం	1,500
దత్తిరాజేరు	550
మెంటాడ	340
బొండపల్లి	130

2,520 ఎకరాల్లో పంట సాగు

గజపతినగరం వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో రబి సీజన్‌కు సంబంధించి 2,520 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పంటకోత పనులు పూర్తయ్యి, విక్రయాలు ప్రారంభమయ్యాయి. గజపతినగరం మండలంలోని శ్రీరంగరాజపురం, కాలంరాజుపేట,పిడిశీల,సీతారామపురం,ఎం.గుమడాం, దత్తిరాజేరు మండలంలోని ఎం.లింగాలవలస, గడసాం, పోరలి, దాసుపేట, సరాయివలస, మెంటాడ మండలంలోని పెదమేడపల్లి, పెదశామలాపల్లి, పోరాం, ఆండ్ర, జక్కువ, బొండపల్లి మండలంలోని ముద్దూరు, గరుగుబిల్లి తదితర గ్రామాల్లో పంటకోతలు, పంట విక్రయాలు ప్రారంభయ్యాయి.

కనీసం రూ.3 వేలు మద్దతు ధర ప్రకటించాలి



గత కొన్ని సంవత్సరాలుగా మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నాను. ఎరువులు, పురుగు మందులు, ఇతర పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించి మద్దతు ధర ఏమాత్రం సరిపోదు. పెట్టుబడి ఖర్చులను దృష్టిలో ఉంచుకుని క్వింటాల్‌కు కనీసం రూ.3 వేలు మద్దతు ధర చెల్లిస్తూ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది.

– బి.గోపాలరావు, రైతు, పిడిశీల గ్రామం, గజపతినగరం మండలం



సీతారామపురంలో పొలాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న కండెలు

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి



నెల్లిమర్ల రూరల్: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు



విజయనగరం గంటస్తంభం: వైఎస్సార్ కాలనీలో అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న యువత



నెల్లిమర్ల: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని సీపీఎం నేతలు పిలుపునిచ్చారు. మండలంలోని కొండగుంపాం గ్రామంలో సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ పోరాట పటిమను యువత అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాపారావు, సూరి, పైడినాయుడు, రాజారావు, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు..

విజయనగరం గంటస్తంభం: ఎస్‌వైఎస్, పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి స్థానిక వైఎస్సార్‌నగర్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువజనులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఎం.అప్పలరాజు, బిగిరి ప్రసాద్, సీహెచ్.దిలీప్, జి.నాగరాజు మాట్లాడుతూ.. ఆకలి, దారిద్ర్యం, అసమానతలు, నిరుద్యోగం వంటి రుగ్మతలకు వ్యతిరేకంగా యువజనులు, విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.అప్పారావు, కె.భాస్కరరావు, ఎస్‌కే మదీను, ఎ.చందు, కె.కుమార్, కె.రాజు, ఎ.మురళీకృష్ణ, బి.ఆనంద్, ఎం.ఆకాశం, ఎం.శరత్, ఎ.లోహిత, ఎస్.పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమించాలి

నెల్లిమర్ల: భగత్‌సింగ్ స్ఫూర్తిగా కార్మికులు, కర్షకులు ఉద్యమించాలని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. జరజాపుపేట అమరవీరుల స్థూపం వద్ద భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగత్‌సింగ్ ఆనాడు తెల్లదొరల పాలనన పోరదోలితే.. ప్రస్తుతం పాలిస్తున్న పాలకులు కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టు పెట్టి దోచుకుంటున్నారని మండిపడ్డారు. నేటియువత భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్వాతంత్ర్య పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని నల్లదొరల పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కె.పద్మనాభం, జె. ప్రకాష్, ఎస్. సూర్యారావు, టి.గణపతి, బి.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.